# ఆటమంచిదే మోతకోర్వాలె

మా మాల్లెం మల్లా ఇచ్చుకపోయేటట్టుంది. జంగం పంతులు ఊర్లెలేడు. వచ్చినా నాటుకం పేరెత్తడు. ఇప్పటికే రెండు దెబ్బలుతాకినయి. తబులాలు తాళాలు, మేకప్ సామాన్లు, పరుదాలు, షాందిరి, బొంగుకట్టెలు అన్నీ మా ఇంట్ల దులాలమీద ఎక్కిచ్చినం.

మూటీ ఇచ్చుకపోతే మల్లా కుదరదని కొండయ మామ భయం. అందుకని ఎవరినీ జారిపోనిత్తలేడు. ఒకసారి లెక్కలని, మరోసారి ఇంకా ఏదోనని అందరినీ జమచేస్తుండు. మా ఇంట్లనే మీటింగ్ పెడుతుండు. ఎవరు చచ్చిపోయినా, పెద్దకర్మలయినా పుణ్యముంటదని బజన చేయిస్తుండు. ఒకవైపు మ్యాల్లాన్ని మూటీగా ఉంచుతూనే మరోవైపు పంతులు కొరకు దేవులాడుతుండు.

నాటకంలో అందరు ఒకెత్తయితే తబలాకాడు ఒక్కడు ఒకెత్తు. తనపాత్ర వచ్చినప్పుడు నటించాలె. అయిపోంగనే తబలాపట్టాలె. పల్లెం ఎత్తుకోవాలె. పల్లెం అంటే కోరస్. నాటకాల్లో ప్రతీపాటకు, పాటలోని ప్రతీ చరణానికి కోరస్ ఇయ్యాలె. ఇంకా తబలాకాడు ఏ పాటకు ఏ రకంగా తబలాకొట్టాలో నిర్ణయించుకోవాలె. ఏ తాళం మీద ఎట్లా ఎత్తుకోవాలే...ఆట తాళం మీద, జులువతాళం మీద, ఆదితాళం మీద, రూపకంమీద, ఏకతాళం మీద, దర్వుమీద ఎట్లా తబలా దించాలో తెలుసుండాలె.

అన్నింటికి మించి ప్రార్థన మొదలుకొని మంగళారతి పాటదాకా రెండుచేతులు ఆడాలె. పొద్దంతా పనిచేసిరావడం ఒకెత్తు అయితే రాత్రంతా తబలాకొట్టడం మరో ఎత్తు. ఐదు నిమిషాలు బయటకు పోదామన్నా పోరాదు. అందుకే తబలాకాడికి నవనాడులు పనిచెయ్యాలంటడు కొండయమామ. ఒక్కరాత్రి తబలా కొట్టుడు కంటే ఎకరం పొలం ఒడ్లు పెట్టుడు, దున్నిరొప్పుడు నయమంటడు మామ.

మా మ్యాల్లెంల తబలాకాడంటే కొండయమామనే! దుమ్ములేపుతడు. మామ పాత్రవచ్చినప్పుడు మాత్రం కుమ్మరి నర్సింలు కొడుతడు. నర్సింలుకు ఇంకా చెయ్యితిరుగలేదు. వేళ్లతో ఆడియ్యడు. అరిచేతులతో దప్పదప్పకొడుతడు. 'బబ్బన్నక పప్పన్నక'...శబ్దంమీదనే పాటకు కలుపుతడు.

నర్సింలు తబలాపట్టినప్పుడు పాట తాళం రెండే కలుస్తయి. తబలా వాటిని కలుపుకొనిపోతది. మామ తబలాపడితే పాట తాళం రెండూ తబలావెంట పరుగెత్తాలె. వాళ్ళిద్దరి పాత్రలు ఒకటే సారి రాకుండా చూసుకుంటరు. ఇక తాళాలంటరా! సగం మందికి కొట్టచ్చు. రెండు తాళంజోల్లు అందరిదగ్గరా తిరుగుతయి.

మామ నర్సింలుకు తబలా పూర్తిగా నేర్పాలని చూసిండు. ఎందుకంటే తను వచ్చినా రాకపోయినా ఇంకొకరున్నారంటే ఎంతో ధీము. రోజుకొక్కలు కొట్టినాకొట్టొచ్చు. వాడే నేర్చుకోలేదు. నేర్చుకుంటే రాత్రంతా కొట్టు మంటరని భయం. మామ అట్లగాదు. ఎంతపనిచేసినా, జరం వచ్చినా, చేతులు గుంజినా వచ్చుడు వచ్చుడే! కొట్టుడు కొట్టుడే! ఏ పనికి ఎనకా ముందుకాడు.

ఒకసారి కొండయ మామకు మస్తు జరమచ్చింది. పొద్దంతా మంచంలోంచి లెవ్వలేదు. పక్కబొర్రియ్యలేదు. రెండు గ్లూకోజులు ఎక్కినయి. అయినా రాత్రికి రియార్సల్‌కు వచ్చిండు. తబలా పట్టిండు. ఈ విషయం తెలిసి మా తాతకు కోపమొచ్చింది. 'వీని సంగతి చెప్పుత ఉండు' అని రియార్సల్ దగ్గరికి వచ్చిండు.

తాత వచ్చేవరకే మామ పాత్ర వచ్చింది. తబలా మీదినుంచి లేచి పాట పాడుతండు. తాత ఏమనుకున్నడోగాని కొద్దిసేపు కూసుండి వెళ్లిపోయిండు. నోరుగూడా తెరువలేదు. మా లస్మవ్వతో మాత్రం 'ఎమో అనుకున్న గనీ మన కొండనిది కిన్నెర రాగమేనే! పాటను ఎంత మజుబూతుగ పాడుతడనుకున్నవు. మా నాయిన లెక్కనే!' అన్నడట.

అవ్వ నవ్వుతూ "ఆ..మీనాయిన..కొంచెమా...పాటపాడితే దబ్బులరాళ్లువోసినట్టే. వాడు మా అన్నసాలు" అన్నదట.

ఆటలు నేర్పే పంతులు దొరుకక కొండయమామ పక్కఊర్ల కూడా వెదుకుతండు. ఎవరింట్ల ఏ పండుగైనా అందరం నిలబడాలంటడు. అవసరానికి ఆదుకోవాలంటడు. మా మ్యాల్లెంలో మంచి మూటీ వచ్చింది. అప్పుడే సాకలి మల్లయ్య చెల్లె పెండ్లి కుదిరింది.

అప్పటికి ఇంకా ఆయిటి మూనలేదు. మల్లయ్య మాత్రం చింతపువ్వు కార్తికి రెండెకురాలు దున్నిండు. రెండురోజుల్లో నాట్లు. చెరువుకొనకు లేటుగా నాటువేసిన సాంబమసూరి కోతకచ్చింది. "ఈ యేడు పెండ్లి చెయ్య. పనితీరది" అన్నడు మల్లయ్య. అతడు మా మాల్లెం మనిషే!

'ఒరిపిచ్చోడా..ఆడివిల్లపెండ్లి ఎత్తగొట్టుకుంటార్రా వద్దు' అన్నడు మామ. అందరినీ జమకొట్టిండు. ఒక్క రాత్రికిరాత్రే కల్లం లేపుకచ్చిండు. రెండురోజులల్ల నాటు వేసిండు. ఒకనాడు కట్టెలు కొట్టిండ్రు. ఇంకోనాడు బియ్యం పట్టుకచ్చిండ్రు. లగ్గం అవలీలగ ఎల్లదీసిండ్రు.

మా మాల్లెంల కులానికొక్కలు ఉన్నరు. వాళ్లు ఎంతమూటి మీద ఉన్నరంటే..మా లస్మవ్వ ఎప్పుడో బుద్ధివుట్టి 'కొండా..నాలుగు చిప్పలకాయలు తేకపోతివిరా' అన్నది. తెల్లారే సరికి నాలుగు సంచులు దిగినయి. మా బాపుకు బర్రె పాకకు రెండు గుంజలు తక్కువ పడ్డయి. కొండయ మామకు చెబితే పొద్దుగూకే వరకు నాలుగు గుంజలు దిగినయి. మా ఇంట్ల సత్యనారాయణ రతమైతే రెండు సంచుల బంతిపూలు దిగినయి.

ఎవలింట్ల పండుగైనా బొట్టు పంపుతంర్రు. బోజినానికి రమ్మంటంర్రు. ఎటుపోయినా మామాల్లెపోల్లు మూటీమీద పోతంర్రు. ఎక్కడన్నా పక్క ఊర్లె నాటుకాలేత్తే కలిసిపోయి చూసివత్తంర్రు.

రియార్సల్ ఉంటెనే మంది మూటిమీద ఉంటరని మామ నమ్మకం. రియార్సల్ ఉండాలంటే నాటకం నేర్వాలె గదా! నాటకం నేర్వాలంటే పంతులు కావాలె. మాఊర్లె పంతులు దొరుకడని తెలిసిపోయింది. నాటకం నేర్వకుంటే మూటీ ఉండదని తెలిసిన మామ పంతులు కొరకు ప్రయత్నం చేత్తనే ఉన్నడు.

నాగంపేటల పంతులున్నడని ఎవలో చెప్పింర్రట మామకు. అంతే! తెల్లారేసరికి సైకిల్మీద నాగంపేటలున్నడు. పంతులు ఊరికి పోయిండంటే వరుసగ రెండు రోజులు పొద్దుమాపు పోయిండు మామ. మూడవనాడు పంతులును కలిసి మాట్లాడిండు. ఒప్పించి సైకిల్మీద తీసుకచ్చిండు. రియార్సల్ మా ఇంట్లోనేగదా!

మొదటినాడు పంతులు మనిషికొక పాటపాడిచ్చిండు. పాటలు అట్లా పాడద్దని వేరే తరీకన పాడిసూపిచ్చిండు. ఒక్కపాటనే ఆటతాళం మీద ఎట్లాపాడచ్చునో, రూపకం మీద ఎట్లా పాడచ్చునో పాడిసూపిచ్చిండు. పంతులు మంచి తబలాకాడు. కొండయ మామనే అంటె అంతకంటే తాత. 'గుణసుందరి' నాటకం నేర్పిత్తానన్నడు. అదియక్షగానం గాదు. నాటుకం. పాటలన్నీ రూపకం, ఆదితాళాలే! మంచి మంచి కంద పద్యాలు సీసపద్యాలున్నయి. పల్లీల హర్మానీగాని ఉంటే..సామిరంగా మోత మోగుతుండె.

పంతులు దొరికినంక అందరికీ పానమచ్చింది. మల్లీ రియార్సల్ మొదలయింది. ఆటమంచిదేగనీ మోతకు ఓర్వాలన్నట్టు బరువంతా మామమీదనే పడింది. సూడు సూడు మన్నట్టు అప్పుడే వానమీద వాన రెండు వానలుకొట్టినయి. అందరూ పునాస దున్నుకాలకు సాగింర్రు.

నిజంగనైతే అది నాటుకాలు నేర్చేకాలమేగాదు. పనిఉన్న దినమేనాయె. పొద్దంతా దున్నిదున్ని అలసటగా ఉంటది. కొండయమామ నైతే మాపటేల పొలంనుంచి ఇంటికి రాంగనే సైకిల్ అందుకుని నాగంపేట పోవాలె. పంతులును ఎక్కించుకుని రియార్సల్కు

రావాలె. మళ్లీ మబ్బుతోనే సైకిల్‌మీద పంతులును ఊర్లెదించి రావాలె. ఎంత లేదన్నా నాగంపేట నాలుగు కిలోమీటర్లు.

అంతదూరం నుంచి వచ్చుడు పోవుడుకు పంతులుకే యాష్టకచ్చిందిగనీ మామకు మాత్రం యాష్టకు రాలేదు. అక్కడ పంతులు కులానికి పెద్ద మనిషట. ఏవేవో పనులుంటయి. అంత దూరం పోతే ఒకనాడు పని ఉందని, ఇంకోనాడు చుట్టాలచ్చింద్రని, ఒకనాడు కల్లుతాగిన్నని మర్రగొడుతుండె. సైకిలందుకుని మామ వట్టిగనే తిరిగివత్తుండె.

ఒకటి రెండుసార్లు మా దాసు చిన్నాయిన సైకిలందుకుని నాగంపేట పోయిండు. పోయేటప్పుడు ఏమీలేదుగని వచ్చేటప్పుడు ముసురు మొదలయింది. పంతులును సైకిలిమీద ఎక్కించుకు వత్తూ వత్తూ గుడిగడ్డకు సైకిల్ మీది నుంచి జారిపడ్డరట. పంతులైతే గుమ్మడి పండు కూలినట్టు కూలిండట. పెయ్యంతా బురదనే. బట్టలంతా బురదనే.

పనులన్నీ తీరేదాక రియార్సల్ ఆపెద్దాం అన్నడు పంతులు. వచ్చినయి మరిచిపోతం. ఆటాడేసి బందుపెడదాం అన్నడు కొండయమామ. పంతులు కొరకు పోవడం రావడం తప్పుతుందని మామకు కూడా అనిపించింది.

“ఆటపూర్తిగా నేర్వలేదు. రెండువారాలన్నా రియార్సల్ చేయలేదు. ఎట్ల ఆడుతం” ఒకలిద్దరు మేటివేశకాళ్లు అనుమానంగా అడిగింద్రు మామను.

‘ఆ....ఏముందిలే మొదలు పెట్టినందుకు ఎట్లనో ఎల్లదియ్యాలె. కచీరు ముందు వట్టిగనే ఆడుదాం’ అన్నడు కొండయ మామ. ఓ పనైపోతుందనుకుని మా పంతులుగూడా ‘ఏ..ఆడుండ్రి నేను పరుద సాటుకు నిలబడి పాటలు అందిత్తతియ్యండ్రి. సగం నేర్చి ఎట్ల వదిలేత్తరు. పలానా పంతులు సగమే నేర్పిండని పేరా..?’ అన్నడు.

అందరం సరేననుకున్నం. మనిషికి ఐదురూపాయలు జమచేసి సామాన్లు, మేకప్ రంగులు తెచ్చుకున్నం. అంతవరకు సగం నేర్చిన ఆట ఎప్పుడూ ఆడలేదు. అందరికీ మా పంతులు మీదనే నమ్మకం.

మా పంతులుగూడా అందరికీ ధైర్యం చెప్పుతుండు. మీకెందుకు నేనులేనా అంటుండు. అప్పుడే రెండుమూడురోజులు గెరువయింది. మొగులుమీద మచ్చలేకుండా ఎండగొట్టింది.

అందరం ఏశాలు ఏసుకున్నం. ఆట మొదలువెట్టినం. అంతే! ఉరుములు, మెరుపులు పెద్దగాలివాన. షాందిరికి షాందిరి బతకమ్మలేసినట్టు లేచింది. ఏశాల మీదనే ఎక్కడోల్లక్కడ ఉరుకుడే ఉరుకుడు.